# మానవుడు దేహమే తానని భావించి ఆనందమునకు దూరమవుతున్నాడు

స్వబోధే నాన్యబోధేచ్ఛా బోధరూపతయాత్మనః
న దీపస్యాన్యదీపేచ్ఛా తథాస్వాత్మా ప్రకాశతే.

దేదీప్యమానంగా ప్రకాశించు దీపమును చూడవలెనన్న ఇంకొక దీపమును మనం వెతుకనక్కరలేదు. అటులనే జ్ఞానస్వరూపుడైన నిన్ను వెతుకుటకు మరొక జ్ఞానము అక్కరలేదు.

**ఎట్టి విద్యలు జగతిని ఎరుగనట్టి**
**పక్షిజాతులు పశువులు పరమమైన**
**నీమమును బూని జీవింప నేర్చియుండ**
**తెలివి కలిగిన మనుజుడే తెలివిదప్పి**
**బ్రతుకుచున్నాడు మనుజుకీ తెలివి లేదె**
**ఉన్నమాట తెలుపుచున్నమాట.**

**వినయ, విధేయతలు, నీతి, శీలములనే పునాదులపైననే జీవిత సౌధముయొక్క భద్రత ఆధారపడి ఉంటుంది**

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

జీవితము నాలుగంతస్తుల సౌధము. ఈ భవనము భద్రముగా ఉండవలెనన్న దీనికి పునాదులు ప్రధానము. భవనము పదిమందికి కనిపిస్తుంది. భవనము అందచందాలతో రూపొందింపచేస్తుంది. ప్రజలను భవనము ఆకర్షిస్తుంది. కాని, పునాదులకు అందచందములు లేవు. ఎవ్వరూ దానికి ఆకర్షితులు కారు. అయితే ఈ భవనముయొక్క

sri sathyasaivachanamrutam

భద్రత దాని పునాదిపైననే ఆధారపడి ఉన్నది. భవనముయొక్క శిరస్సునందుకాని, అనగా పైభాగమునందుకాని, మరి ఏ భాగమునందుకాని ఆ భద్రత నిక్షిప్తమైయుండలేదు. అయితే పునాది ఈ భవనమంతయు తనపైన ఆదారపడి ఉన్నది అని అహంకారము చెందడం జరుగదు. ఎవరో ఒకరు వర్ణించినను, పొగడినను, తెగడినను పునాదికి వచ్చిన కీర్తికాని, కొరతకాని లేదు. కాని, భవనమంతయును ఆ పునాదిపైననే ఆధారపడి ఉండటం ప్రజలందరికి తెలిసిన ప్రత్యక్ష సత్యము మరియు అనుభూతి. అదేవిధంగా జీవితసౌధమునందు మొదటి అంతస్తు - బ్రహ్మచర్యం. రెండవ అంతస్తు - గృహస్థం. మూడవ అంతస్తు - వానప్రస్తం. నాలుగవ అంతస్తే - సన్యాసం. చాలామంది ఈ నాలుగంతస్తులు నిర్మించుకుంటారు. కొంతమంది మూడంతస్తులు మాత్రమే నిర్మించుకుంటారు. కొంతమంది రెండస్తులు మాత్రమే నిర్మించుకుంటారు. కానీ ఏ అంతస్తుకూడా పునాది లేకుండా మాత్రం ఉండదు. ఈ జీవితసౌధములో మొదటి అంతస్తువారే బ్రహ్మచర్య స్వరూపులు. కనుక,

విద్యార్థులైనటువంటి మీరు మీ జీవిత భవనమునకు భద్రమైనటువంటి పునాదిని వేసుకోవలసి వస్తుంది. ఈ పునాదులే వినయ విధేయతలు, నీతి శీలములు. ఈ నాలుగింటియొక్క భద్రతపైననే మనయొక్క భవిష్యత్తు అనేటువంటి భవనము ఆధారపడి ఉంటుంది. దురదృష్టవశాత్తు ఈనాడు దేశమును పట్టి పీడించుచున్నటువంటి ఏడు పాపములు మహా విజృంభించిపోతున్నవి.

**వేషమునకు తగిన వ్యవహారము ఉంటుండాలి**

వీటిలో మొదటిది నీతిలేని వాణిజ్యము. తరువాత వరుసగా నిజాయితిలేని రాజకీయము, శీలములేని విద్య, త్యాగములేని ఆరాధన, కృషిలేని సంపద, మానవత్వములేని శాస్త్రము మరియు స్థిరములేని భక్తి. ఈ ఏడు విధములైనటవంటి మహా పాపములు ప్రపంచాని పట్టి పీడిస్తున్నవి. ఏనాడు నీతి కలిగిన వాణిజ్యము, నిజాయితీ కలిగినటువంటి రాజకీయము, శీలము కలిగిన విద్యావంతుడు, కృషితో కూడిన సేద్యము, త్యాగము కలిగిన ఆచారము, శాస్త్రము, గుణముతో కూడినటువంటి మానవత్వము, స్థిరమైనటువంటి భక్తి కుదురునో,

srisathyasaivachanamrutam

ఆనాడే దేశము నిత్యకళ్యాణము, పచ్చని తోరణముతో కిలకిలలాడుతూ కలకల నవ్వుతుంది. మానవత్వమనగా కేవలము ఇట్టి సుగుణములతో కూడినటువంటి భవనము. అయితే మానవునియందు ఈనాడు ఈ శీలసంపద, నీతి నిజాయితీలు, కృషి, శాశ్వతమైనటువంటి త్యాగము సన్నగిల్లిపోతున్నవి. విద్యార్థులయందు ఉండవలసినటువంటి ఈ సుగుణములు లేకపోవటంచేత దేశము మరింత అల్లకల్లోలములతో అశాంతికి గురియౌతున్నది. విద్యార్థులకు వినుటకు ఇది కొంత అయిష్టంగా ఉండినప్పటికిని, విద్యార్థులయొక్క ప్రవర్తనను అరికట్టుటకుకాని, ప్రజల నోరు మూయటంకాని ఎవరికీ సాధ్యం కాదు. వేషమునకు తగినటువంటి విచారముండాలి. వేషమునకు తగినటువంటి వ్యవహారముకూడను ఉండాలి. వేషమునకు తగిన వ్యవహారమే లేకపోతే, సంప్రదాయమునకే తలవంపులుగా ఉంటుండాది.

ఒకానొక సమయములో ఒక మహారాజు ఆస్థానమునకు ఒక పగటి వేషగాడు శంకరాచార్య వేషమును ధరించి వచ్చాడు. శంకరాచార్యులవారు రావటము గమనించి మహారాజు ఆయనకు స్వాగతము పలికి ఉన్నత ఆసనమును ఇచ్చి కుశల ప్రశ్నలు వేస్తూ వచ్చాడు. శంకరాచార్య వేషమునకు తగినట్టుగా ఆ వ్యక్తి

**జన్మ దుఃఖం జరా దుఃఖం జాయా దుఃఖం పునఃపునః**<br>
**సంసార సాగరం దుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత.**<br>
**మాతా నాస్తి, పితా నాస్తి, నాస్తి బంధు సహోదరః**<br>
**అర్థం నాస్తి, గృహం నాస్తి తస్మాత్ జాగ్రత జాగ్రత.**

అని జీవితానికి ఆధారమైనటువంటి నీతులను ప్రబోధిస్తూ వచ్చాడు. కడపటికి వెళ్ళునప్పుడు మహారాజు ఒక వెండి పాత్రలో నాణెములను తీసుకుని వచ్చి అతనికి బహూకరించాడు. అప్పుడా వ్యక్తి 'రాజా! దీనిని నేను స్వీకరించను, 'నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానసుః' అమృతత్వాన్ని పొందవలసినటువంటి మానవుడు దీనిని స్వీకరించరాదు. 'త్యాగేనైకే అమృతత్వ మానసుః,' 'రాజా! రేపటి దినము మరొక వేషముతో నీయొక్క ఆస్థానమునకు వస్తున్నాన'ని చెప్పి వెళ్ళిపోయేడు. రెండవ దినము చక్కగా ఒక నర్తకి వేషం

sri sathyasaivachanamrutam

వేసుకొని వచ్చి ఆయొక్క మహాసభయందు నృత్యము చేశాడు. ఆ నృత్యము అద్భుతంగా ఉంటున్నది. రెండు పాదములు భూమిపైన నిలవలేకపోయినవి. ఈ నృత్యము చూచినటువంటి సభాసదులందరుకూడను మహా ఆశ్చర్యము నొందారు. ఈ నృత్యము అంత్యము కాగానే మహారాజు ఒక పళ్ళెరములో నాణెములను తీసుకొని వచ్చి ఆ నర్తకికి అందించాడు. అప్పుడు నర్తకి వేషములో నున్న ఆ వ్యక్తి 'రాజా! ఈ నాణెములు నాకు చాలా తక్కువ, ఇంకా ఎక్కువ కావాలి' అంది. అప్పుడు రాజు 'నిన్నటి దినము నాణెములే వద్దన్నావు. ఈనాడు ఈ నాణెములు చాలవంటున్నావు. ఏమిటీ ఆశ్చర్యము?' అన్నాడు. 'వేషమునకు తగిన వ్యవహారము' అని బదులు చెప్పాడా వ్యక్తి. 'నిన్న శంకరాచార్య వేషం వేసుకున్నాను, దానికి తగినటువంటి వ్యవహారము నేను ప్రదర్శించాను. ఈనాడు నేను నర్తకి వేషమును ధరించాను. నృత్యమునకు తగినటువంటి ధనమును నేను ఆశిస్తున్నాను' అని వివరించాడు.

**ఈనాడు జీవితంలో ఆయా ఆశ్రమధర్మాలకు అనుగుణంగా ప్రజలు నడుచుకోకపోవటంవలన దేశము అనేక అల్లకల్లోలములకు, అశాంతికి గురవుతున్నది**

దీనియొక్క అంతరార్థమేమనగా జగత్తునందు బ్రహ్మచర్యంకాని, గృహస్థంకాని, వానప్రస్తంకాని, సన్యాసముకాని, ఏ ఆశ్రమధర్మంలో ఆయా పరిస్థితులకు తగినటువంటి వ్యవహారము జరగటంలేదు కనుకనే ఈ దేశము అనేక విధములైనటువంటి అశాంతికి గురి కావలసి వచ్చింది. విద్యార్థులు విద్యార్థిదశలో దానికి తగినటువంటి నడవడిక ఉండినప్పుడే వారి సంప్రదాయము మహా ఘనంగా ఉంటుంది. విద్యార్థికి తగినటువంటి వ్యవహారమే లేకపోతే విద్యార్థి సంప్రదాయమునకే తలవంపులుగా ఉంటుండాది. ఒక అధ్యాపకునికి తగినటువంటి ప్రవర్తన ఆ అధ్యాపకునికి లేకపోతే ఆ సంప్రదాయమునకే తలవంపులుగా ఉంటాది. గృహస్థునకు తగినటువంటి వ్యవహారము గృహస్థులయందు క్షీణించినప్పుడు ఆ గృహస్థ సంప్రదాయమునకే తలవంపులు అవుతుంది. కనుక మనము జీవితమును ఏ కాలమునందు ఏ దేశమునందు అనుభవిస్తున్నామో ఆ దేశ కాల పాత్రలను అనుసరించి తీర్చిదిద్దుకోవాలి. దైవత్వమునందుకూడను ఇట్టి పవిత్రమైన, విచిత్రమైన వ్యవహారము గోచరిస్తూ వస్తున్నది.

sri sathyasai vachanamrutam

**మానవత్వములో దివ్యత్వముయొక్క స్వభావాన్ని గుర్తించుకోవటం చాలా కష్టంగా ఉంటుంది**

ద్వాపరయుగమునందు ఒక గోపిక ఒక బావికి వెళ్ళి రెండు పాత్రల్లో నీరు నింపుకొని, ఒక పాత్రను తలపైనుంచుకొని, ఇంకొక పాత్ర దానిపైన ఉంచుకోడానికి ప్రయత్నం చేసినప్పుడు ఎవ్వరూ సహాయము చేసేవారు లేకపోయారు. ఆ సమయములో కృష్ణుడక్కడికి ఏతెంచాడు. 'కృష్ణా! ఈ పాత్రను నా తలపైనున్న పాత్రపైన ఉంచుతావా?' అని ఆ గోపిక ఆయనను ప్రశ్నించింది. కృష్ణుడు చెప్పాడు. 'నేనీ పని చెయ్యను' అన్నాడు. 'అయ్యో! కృష్ణుడే చెయ్యకపోతే, ఈ జగత్తునందు సహాయపడు వారెవ్వరు?' అని ఆమె విచారించుచూ ఉండగనే, మరొక స్త్రీ వచ్చింది. ఆమెయొక్క సహాయంచేత ఆ పాత్రను మొదటి పాత్రపైన ఉంచుకొని, ఆ గోపిక ఇంటికి వెళ్ళింది. ఆమె వెంటనే వెళ్ళిన కృష్ణుడ్ని ఆశ్రయించకనే, ప్రార్థించకనే, కృష్ణుడు మొదటి పాత్రను తీసి క్రిందకు దింపినాడు. ఈమెకు ఆశ్చర్యం వేసింది. 'కృష్ణా! బావి దగ్గర ఈ పాత్రను నా తలపై నుంచమన్నప్పుడు నీవు ఏమాత్రంకూడను అంగీకరించలేదు. ఇప్పుడు నిన్ను ప్రార్థించక పూర్వమే నీవీ పాత్రను క్రిందకు దింపటంలో ఉండినటువంటి అంతరార్థం ఏమిటి?' అని ప్రశ్నించింది. అందుకు కృష్ణుడు 'గోపికా! బరువును దింపే స్వభావమే నాది కాని, బరువును తలపై ఉంచే స్వభావం నాది కాదు?' అన్నాడు. అనగా భగవత్‌తత్త్వమునందుకూడను భారమును దింపేటటువంటిదే తనయొక్క వ్యవహారముకాని, భారమును మోపేటటువంటిది కాదు. మానవత్వములో ఇట్టి సహజమైనటువంటి దివ్యభావాన్ని గుర్తించుకోవటం చాలా కష్టంగా ఉంటుంది.

**మానవుడు స్వస్వరూపజ్ఞానము లేక ఆనందముకొరకు బయట ప్రపంచములో అన్వేషణ జరుపుతున్నాడు**

మానవుడు ఆనంద పిపాసి. ఆనందమే అతనియొక్క స్వరూపము. కాని తన స్వరూపాని తాను గుర్తించుకోలేక ఆనందం బయట ప్రపంచంలో ఎక్కడో లభించునని దానిని అన్వేషణ సలుపుతూ ఉన్నాడు. చదువునందు ఆనందము కలదని అనేక చదువులు చదువుతున్నాడు. కాని, చదివినంత మాత్రమున అతనికి ఆనందం లభ్యం కావటం లేదు. ఉద్యోగం చేస్తే

srisatyasaivachanamrutam

ఇందులో ఆనందం తనకు లభ్యమౌతుందని ఉద్యోగాలకోసమని అనేక ప్రయత్నములు చేస్తున్నాడు. ఉద్యోగం చిక్కిన తరువాతకూడా అతనికి ఆనందము సంప్రాప్తము కావటంలేదు. తదుపరి వివాహమాడితే గృహస్థుడుగా ఉండినప్పుడు ఈ ఆనందం ఏమైనా లభ్యమౌతుందేమో అని గృహస్థుడవుతున్నాడు. కాని ఆ గృహస్థ ఆశ్రమమునందుకూడను ఆనందమతనికి లభ్యము కాలేదు. సంతతివల్ల ఏమైనా ఆనందము లభ్యమౌతుందో ఏమో అని సంతతి నాశిస్తున్నాడు. కాని, సంతతివల్లకూడను అతనికి ఆనందం లభ్యము కావటంలేదు. కడపటికి చదువు, ఉద్యోగము, సంపద, సంసారము-అన్నికూడాను ధనముపైన ఆధారపడి ఉన్నవని 'ధనమూలమ్ ఇదం జగత్' అని ధనమును సంపాదించే నిమిత్తమై కంటికి నిద్దుర లేక కడుపుకు అన్నము లేక రాత్రి, పగలు శ్రమిస్తాడు. కడపటికి ఆ సంపాదించినటువంటి ధనమును తాను అనుభవించక, ఏ దొంగలపాలో లేక దుర్మార్గులైనటువంటి పుత్రుల పాలో చేసి చేతులు నలుపుకుంటూ, గుండెలు బాదుకుంటూ అవస్థలకు గురియౌతున్నాడు.

**త్యాగమే ధనవంతునికి తగిన గుణము**

చదువునందుకాని, ఉద్యోగమునందుకాని, గృహాస్థాశ్రమమునందుకాని, సంతానమునందుకాని, ధనమునందుకాని ఆనందము తాత్కాలికమైనటువంటిదిగా రూపొందుతుందేకాని, శాశ్వతానందము ఇందులో లేదని అప్పుడు గుర్తిస్తాడు మానవుడు. ధనముండికూడను ఆనందమునకు నోచుకోలేకపోతున్నాడు మానవుడు. గడ్డివాముపై కుక్క కూర్చున్నట్టుగా ఉన్నది ఈనాడు మానవుని పరిస్థితి. అది పశువులను ఆ గడ్డివాముదగ్గరకు రానివ్వదు. తాను తినదు. అదే విధముగనే ధనమున్నవాడు తాను త్యాగము చెయ్యడు. సుఖాన్ని అనుభవించడు; అలాగని ఆ ధనాన్ని ఇతడు ఇతరుల ఉపయోగముకొరకు ఖర్చు చేయడు. ఇలాంటి ధనము ధనవంతునికి తగినటువంటి గుర్తు కాదు.

త్యాగమే ధనవంతునికి సరియైన గుణము. త్యాగములోనే ఆనందము వస్తుందని తాను గుర్తించుకోలేకపోతున్నాడు. ఈ ఆనందమునకు అడ్డు తగిలేటువంటివి ఏమిటి? పంచ క్లేశములు మానవునికి అడ్డు తగులుతున్నవి. ఇవి అవిద్యా క్లేశం, అస్థిత క్లేశం, అభినవ

srisathyasaivachanamrutam

క్లేశం, రాగ క్లేశం మరియు ద్వేష క్లేశం. మానవుని ఈ ఐదు క్లేశములు పట్టి బాధిస్తున్నవి.

**మానవుని ఆనందమునకు అడ్డు తగిలే పంచక్లేశములు**

అవిద్యాక్లేశమనగా శాస్త్రము ఒక ప్రశ్న వేసింది-'కస్య మూర్ఖః' ఎవడు ఈ జగత్తులో మూర్ఖుడు? అని ప్రశ్న వేసింది. శాస్త్రము తిరిగి దానికే జవాబు చెప్పింది. 'మూర్ఖో దేహాద్యహం బుద్ధిః,' మూర్ఖుడెవరనగా దేహమే నేను అని విశ్వసించినటువంటి వాడు. మానవుడు దేహమే తానని మూర్ఖత్వములో మునిగి తన స్వస్వరూపాన్ని మరచి, ఆనందమునకు దూరమైపోతున్నాడు. 'దేహము నేను కాదు. దేహ మనో బుద్ధి ఇంద్రియములకంతా సాక్షీభూతుడైనటువంటి ఆత్మను నేను' అని ఏనాడు తాను గుర్తించగలడో అప్పుడే ఈ ఆనందమునకు తాను నోచుకోగలడు. దేహ మనో బుద్ధి ఇంద్రియములన్నీకూడను కేవలము పనిముట్లు. వీటినే కర్మములు అని పిలుస్తూ వచ్చారు. ఇట్టి పనిముట్లు ఉండినటువంటి దేహాన్ని నేననుకొని భ్రమించటమే అజ్ఞానము.

ఈ దేహముండినంతవరకు అనేక విధములైన క్లేశములు ఇతన్ని వెంటాడుతుంటాయి. దీనినే 'జన్మ దుఃఖం, జరా దుఃఖం, జాయా దుఃఖం పునః, పునః, అంత్యకాలే మహాదుఃఖం తస్మాత్ జాగ్రత జాగ్రత,' అని హెచ్చరిస్తూ వచ్చింది శాస్త్రం. ఈ దేహముయొక్క పరిస్థితి ఎలాంటిది?

**బాల్యమందున పలువురతోగూడి**
**ఆటపాటలందు ఐక్యుడగును**
**యవ్వనం బలరిన అలరువిల్తుని పోల్కి**
**కామినీ లోలుడై క్రాలుచుండు**
**అర్ధవయస్సున ఐహికంబున మున్గి**
**ద్రవ్యమార్జించుట దవిలియుండు**
**ముదిమి వచ్చినయంత మురహరి తలవక**
**అదియిది లేదని అలమటించు**
**వివిధ దుర్వ్యసనంబుల వీడలేక**

sri sathyasai vahanamrutam

**భక్తిమార్గంబు వెతుకు నాసక్తి లేక**
**కర్మపంకిలమున బడి క్రాలుచుండు**
**మట్టి గలుపును జన్మంబు మానవుండు.**

ఇది దేహమునకు సంబంధించినటువంటి మహా అర్థం. కనుక, దేహము తానని అనుకోటంచేత అనేక విధములైనటువంటి క్లేశములు మానవుని వెంటాడుతుంటాయి. దీనినే శాస్త్రము 'అవిద్యా క్లేశము' అని పిలిచింది.

ఇంక రెండవది, అభినవ క్లేశము. ఏమిటి ఈ అభినవము? సమస్త దుఃఖములకు, సమస్త రాగములకు, సమస్త వేదనలకు, సమస్త కోరికలకు కారణం ఏమిటి? అదే మనస్సు. ఈ మనస్సువల్లనే అనేక కోరికలును మనలో ఆవిర్భవిస్తున్నాయి. ఈ కోరికలు ఫలించకపోవటంచేత ద్వేషములు ప్రారంభమవుతున్నవి. పోనీ కోరికలు ఫలించెనా మూర్ఖత్వము, మోహత్వము అభివృద్ధి అవుతున్నది. కాన, ఈ జగత్తునందు సమస్త దుఃఖములకు మనసే కారణమని గుర్తించుకొని, ఆ మనస్సును త్యజించకుండా పోవటమే అభినవ క్లేశము. జగత్సంబంధమైన సమస్త విషయములకుకూడను మనసే కారణము. కనుకనే శాస్త్రము 'మనో మూలం మిదం జగత్' అనింది. జగత్తంతా మనస్సువలన ఉద్భవించినదే మనస్సుయొక్క స్వరూపమే! కనుక, 'నా దుఃఖమునకంతా మనస్సే కారణము. ఛీ! ఈ మనసును నేను ఏమాత్రము అనుసరించకూడదు,' అని ఏనాడు మనస్సును త్యాగము చేయునో అప్పుడే మానవుడు ఆనందమును పొందగలడు.

మూడవది, అస్థిత క్లేశము. అస్థిత క్లేశమనగా రాగములచేత అనగా 'అది కావాలి,' 'ఇది కావాలి' అని ఆశలతో కుమిలిపోవటం! విషయ వాసనలలో మునిగినటువంటి చింతనే దీనికి మూలకారణము. ఇవన్నీకూడను అస్థిరమైనటువంటివే! అస్థిరమైన విషయములను స్థిరమని విశ్వసించి దానికోసం విచారించటమే 'అస్థిత క్లేశము' అన్నారు.

నాలుగవది, రాగ క్లేశము. రాగమనగా వాంఛలు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యములంతాకూడను రాగములో మునిగినవే! ఈ రాగములచేతనే మానవుడు తన జీవితమును నాశనము గావించుకుంటున్నాడు. ఇది ఎంతవరకో అంతవరకూ

sri sathyasai vachanamrutam

ఉండవలసిందే! మితి మీరి దీనిని ఉపయోగించుకొనరాదు. లోభత్వమనేటువంటిది మానవునకు మరింత హింసగా ఉంటున్నది. దీనివలన తనకు లభించిన పదార్థములుకూడను తాను అనుభవించలేకపోతున్నాడు, మానవుడు. ఈ రాగక్లేశమనేటువంటిది మానవుని మరింత రోగములో ముంచుతున్నది.

ఇంక ద్వేష క్లేశము. మానవుడు ఏదైనా ఒక దానిని ఆశించి ఒక వ్యక్తిని ఆశ్రయిస్తాడు. ఆ వ్యక్తి అతనికి సహాయపడకుండిన, ఆ వ్యకిపైన ద్వేషాన్ని సాధిస్తాడు. ఇది స్వార్థ, స్వప్రయోజనములతో కూడినటువంటి విషయవాసనే! మానవుడు ఆనందమునకు దూరం కావడానికి కారణం ఏమిటి? అవిద్యా క్లేశము, అభినవ క్లేశము, అస్థిత క్లేశము, రాగ క్లేశము, ద్వేష క్లేశము - ఈ పంచ క్లేశములుకూడను మనం ఏనాడు నిర్మూలం గావించుకుందుమో ఆనాడే మనయొక్క స్వస్వరూపమైన ఆనందాన్ని మనం అనుభవించగలం.

**ప్రతిచర్యకు తగిన ప్రతిచర్య మరొకటి ఉంటుంది**

మీరు విద్యార్థులు. జీవితమనే భవనముయొక్క మొదటి అంతస్తునందే మీరు ఉండేటువంటివారు. ఈ మొదటి అంతస్తునందు జీవితమునకు తగిన భద్రతను మీరు ఏర్పరుచుకొన్నప్పుడే మిగిలిన మూడు అంతస్థులుకూడను సుక్షేమంగా ఉంటాయి. గృహస్థ, వానప్రస్త, సన్యాస ఆశ్రమములకు తగిన సద్గుణములు ఈ వయసునందే మీరు ప్రోగుచేసుకోవాలి. బ్రహ్మచర్యమునందే ఈ గుణములు లేకపోయిన, మిగిలిన దశలకు సంబంధించిన భవనమంతయుకూడను కుప్ప కూలినట్లు కూలిపోతుంది.

విద్యార్థులారా! భవిష్యత్తును దృష్టియందుంచుకొని మీ బుద్ధిని తగినటువంటి మార్గములో మీరు ప్రవేశపెట్టాలి. అప్పటికప్పుడు చూచుకుందాములే అని ఈనాడు మనం చాలా అలక్ష్యం చేస్తున్నాం. ఈ వయస్సులోపల తుచ్ఛమైన వాంఛలకు లొంగి, ఆనందముతో ఆ కార్యములలో మీరు ప్రవేశిస్తున్నారు. నిత్యానిత్య విషయ పరిశీలన జ్ఞానము కోల్పోయి, వివేకమునుకూడను కోల్పోయి తాత్కాలిక ఆనందమునకై పాటుపడుతున్నారు. కాని, భవిష్యత్తులో దీనికి తగినటువంటి పదింతలు దుఃఖము మిమ్మల్ని వెంటాడుతుంది. ప్రపంచమును భగవంతుడు

sri sathyasaivachanamrutam

సృష్టించాడు. సమస్తమును సృష్టించాడు. కాని ఒక్కటికూడను తన స్వాధీనములో ఉంచుకోలేదు. జీవులకు పూర్తి స్వతంత్రమునిచ్చాడు. 'ఏ విధమైనటువంటి అడ్డులు లేకుండా మీరు అనుభవించవచ్చు' అని. అయితే ఒక్క నియమాన్ని మాత్రము తాను అందించాడు, 'ప్రతి చర్యకు తగిన ప్రతిచర్య మరొకటి ఉంటాది. దీనిని మాత్రము లక్ష్యమునందుంచుకొని మీ ఇష్టము వచ్చినట్లు అనుభవించండి' అన్నాడు. భగవంతుడు స్వాతంత్ర్యమును ఇచ్చాడు కదా అని చెడ్డపనుల్లో మనం ప్రవేశిస్తే ఆ చెడ్డ పనులయొక్క ఫలితము చెడ్డదిగానే వస్తుండాది. ఇది భగవంతుడిచ్చినటువంటిది కాదు, మీ చర్యకు వచ్చినటువంటి రియాక్షనే! భగవంతుడు ఎవ్వరికిని ఏ విధమైనటువంటి శ్రమను, అసౌకర్యమును అందించడు. ప్రతి ఒక్కటి మీ సంకల్పములయొక్క ప్రభావములే ఈ విధంగా వస్తున్నాయి.

**ప్రభావము క్షణభంగురమైనది, స్వభావము శాశ్వతమైనది**

విద్యార్థులారా! ప్రభావమునకు గురియై తన స్వభావాన్ని మరచిపోతున్నాడు, మానవుడు. ప్రారబ్ధముయొక్క ఫలితమే ప్రభావము. పురుషార్థముయొక్క ఫలితమే స్వభావము. కనుక స్వభావమునకు, ప్రభావమునకు మధ్య ఉండినటువంటి వ్యత్యాసము మనం గుర్తించాలి. ప్రభావము క్షణభంగురమైనటువంటిది, స్వభావము శాశ్వతమైనటువంటిది. శాశ్వతమైన, సత్యమై, నిత్యమైన స్వభావాన్ని ఈనాడు మనము విస్మరిస్తున్నాము. అనిత్యము, అశాశ్వతము, తాత్కాలికమైనటువంటి ప్రభావాలకు మనం పాటుపడుతున్నాం. దీనియొక్క ప్రతిఫలము తప్పినదికాదు. భగవంతుడు సృష్టించినటువంటి సృష్టిని ప్రజలకు స్వాతంత్ర్యమునందించాడు కదా అని ఇష్టమొచ్చినట్లు వినియోగించుకోరాదు. దానికి తగినటువంటి కొన్ని త్యాగములుకూడను మనం పూనాలి. భగవంతుని సృష్టిలో ఉండిన జీవరాశుల తత్వాన్ని ఒక్కతూరి మీరు వెనుకకి తిరిగి విచారించండి.

**మానవుడు ఏనాడు స్వార్థమును త్యాగము చేయునో ఆనాడే జీవితమునందు ఆనందముననుభవించగలడు**

చెట్టులోపల తీయని ఫలములందించాడు, భగవంతుడు. కాని, ఆ ఫలములను చెట్టు

sri sathyasai vachanamrutam

అనుభవిస్తున్నదా? లేదు, ఇతర ప్రాణులకు అందిస్తుండాది ఆ చెట్టు. చూచారా! భగవత్ సృష్టిలో ఉండిన వృక్షముయొక్క త్యాగము! నదులను సృష్టించాడు, భగవంతుడు. ఆ నదులలో ప్రవహించే జలమును తాను ఒక్క చుక్కైనా త్రాగుతున్నదా నది? ఆ జలమును ఆశించిన జీవులకు త్యాగము చేస్తుండాది. గోవులో పవిత్రమైన క్షీరమునందించాడు, భగవంతుడు. కాని ఆ గోవు తన క్షీరమును తానేమైనా గ్రోలుచున్నదా? లేదు. తన బిడ్డలకు, ఇతరులకుకూడను ఆ క్షీరమును అందిస్తుండాది, గోవు. కాని, సర్వ తెలివితేటలు, సర్వ గుణములు, సర్వ శక్తులు ఉండినటువంటి మానవుడు ఈ త్యాగమునకు నోచుకోలేదు. తాను ఆర్జించినటువంటి సమస్త ఫలములుకూడను కేవలం తను, తనవారి ఉపయోగముకొరకేననే స్వార్థమునందు మునిగి పరార్థమనే త్యాగమునకు అత్యంత దూరమైపోతున్నాడు. కనుకనే మానవుని ఇన్ని విధములైన దుఃఖములు వెంటాడుతూ వస్తున్నాయి. ఇన్ని రకములైన రోగములుకూడను మానవుని వెంటాడుతూ వస్తున్నాయి. పశువులకు అధికంగా రోగములు లేవు. పక్షులకు అధికంగా రోగములు లేవు. ఆ జీవులు ప్రకృతి సిద్ధమైనటువంటి ఆహారమును భుజించి ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. కాని మానవుడు తన తెలివితేటలు వివిధమార్గములలో ప్రవేశపెట్టి రకరకములైన ఆహారమును భుజించి అనేక రకములైన రోగములకు గురియైపోతున్నాడు. ఈ మానవునియందున్నటువంటి ప్రధానమైన రోగము ఒక్కటే! అదే స్వార్థము. ఈ స్వార్థమే పెద్ద రోగము. మానవుడు ఏనాడు స్వార్థమును త్యాగము చేయునో ఆనాడే జీవితమునందు ఆనందమును అనుభవించగలడు.

**సర్వసంగ పరిత్యాగులే నిజమైన రాజులు**

పశు పక్షి మృగాదులయందు, వృక్షములయందుకూడను త్యాగముంటున్నది కాని, మానవునియందు త్యాగము లేకుండాపోతున్నది. త్యాగగుణము కలిగినప్పుడే తేజము అభివృద్ధి అవుతుంది. స్వార్థము పెరుగుకొలది తేజము క్షీణిస్తుంది. ఈ సత్యాన్ని మానవుడు గుర్తించుకోటం లేదు. ఏదో చదవటము, గొప్ప విద్యావంతుడు కావటము, గొప్ప అధికారి కావటము, ధనమును సంపాదించటము, ఆనందముతో తులతూగినట్టుగా నటనలు



sri sathyasai vahini

చెయ్యటమే తప్ప నిజమైన ఆనందము మానవునియందు ఏ మాత్రముకూడను కనిపించటం లేదు. ఒకవేళ ఆనందమును అనుభవించినప్పటికిని, అది కేవలము తాత్కాలిక అనుభవమే కాని, శాశ్వతమైనది కాదు. త్యాగరాజు, పోతరాజు, గోపరాజు అని ముగ్గురు రాజులుండేవారు. గోపరాజు అనేటువంటివాడు రామదాసు. త్యాగరాజు రాముని గురించిన కీర్తనలు గానం చేశాడు. పోతరాజు అనగా పోతన్న; కవి. ఈ పోతరాజు, త్యాగరాజు, గోపరాజు గొప్ప రామభక్తులు. ఈ గోపన్న ఎంత భక్తి ప్రపత్తులు కలిగినవాడంటే భగవంతుని సొత్తునంతా భక్తులు మింగివేస్తుంటే, తన సర్వస్వమును పరమాత్మునికి అర్పించి అదే తన ఆనందము అని ఆనందించాడు. 'అయ్యా రామచంద్రా! నీకు మందిరము లేకుండా ఎండలో, వానలో అవస్థపడుతున్నావా?' అని విచారించి సర్వస్వము ధారపోసి భగవంతునికి మందిరాన్ని కట్టించాడు.

ఇంక పోతరాజు. పోతన్న మహా భాగవతమును రచించాడు. అతనియొక్క రచన రత్న మాణిక్యములవలే ప్రకాశిస్తూ ఉండేటువంటిది. అతని బావమరిది శ్రీనాథుడు వచ్చి 'బావా! నీ కావ్యమును మహారాజునకు అంకితము చేస్తే నీ జీవితం అష్టైశ్వర్యములతో తులతూగిపోతుంది' అని బోధించాడు. అప్పుడు పోతరాజు చెప్పాడు-'శ్రీనాథా! నాకు సర్వ విధములైనటువంటి నాథుడు శ్రీరామచంద్రుడే! నా సర్వస్వమునుకూడను నేను భగవంతునికే అర్పితం చేస్తాను కాని ఈ రాజులకు నేను చెయ్యను' అని ఒక చక్కటి పద్యంలో చెప్పాడు:

**బాలరసాల సాలనవపల్లవ కోమల కావ్యకన్యకన్**
**కూళలకిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్ హా**
**లికులైననేమి గహనాంతర సీమల కందమూల కౌ**
**ద్దాలికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై**

ఛీ! వారిచ్చేటువంటి కూడును భుజించటం కాదు. భగవంతుడిచ్చేటువంటిదానినే నేననుభవిస్తున్నాను. నేను సర్వస్వము భగవంతునికే అర్పిస్తాన'ని పోతరాజు చెప్పాడు. తాను భాగవతము రాసే పూర్వము కూడను

srisathyasaivachanamrutam

**పలికెడిది భాగవతమట**
**పలికించెడి విభుండు రామభద్రుండట**
**నే పలికిన భవహరమగునట**
**పలికెద వేరొండుగాథ పలుకగనేలా?**

అని అంతా భగవంతునికే అర్పితం చేసి ప్రారంభించాడు. తనను కేవలం నిమిత్తమాత్రునిగా భావించుకుని సర్వస్వం భగవంతుడికి అర్పితం చేసి జీవితమును సాగిస్తూ వచ్చాడు.

ఇంక త్యాగరాజు 'సర్వస్వమూ భగవంతుడే! నా రామచంద్రుడే!' అని, రాముడు లేకపోతే తాను లేనని, తన జీవితమే వ్యర్థమని భావించి రాములు ఎక్కడకో వెళ్ళినాడని అతనికొరకు వెదుకుతూ 'నేనెందు వెదకుదురా' అని వాపోయాడు. 'ఎక్కడ నిన్ను వెతికేది? నిన్ను వదలి నేను ఒక్క క్షణమైనా ఉండలేను,' ఈ విధమైనటువంటి భావముచేత సంచారము చేస్తూ వచ్చాడు. తంజావూరు రాజు ధన కనక వస్తు వాహనాదులనంతాకూడను పల్లకీలపైన ఇంటికి పంపించినప్పుడు త్యాగరాజు 'నిధి చాలా సుఖమా, ఈశ్వర సన్నిధి చాలా సుఖమా? నిజముగా దెల్పుము మనసా' అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు. 'ఛీ! ఛీ! ఈ ధన కనక వస్తు వాహనాదులందించినటువంటి రాజులే స్థిరము కాదు. వారు పంపించిన ఆస్తులు స్థిరమౌతుందా? నా కక్కరలేదు. తీసికొని పొండ'న్నాడు. ఈ విధముగా త్యాగము చేసినటువంటివారు కనుకనే వీరు జగత్తునకంతా ఆదర్శమూర్తులై రాజులుగా నిలిచిపోయారు.

గోపరాజు, త్యాగరాజు, పోతరాజు-రాజులనగా ఏమిటంటే సర్వసంగ పరిత్యాగులే రాజులని భావము. అయితే ఈ కలియుగమునందు రాజులనగా ధన కనక వస్తు వాహనాదులతో తులతూగుతున్నవారు రాజులనుకుంటున్నారు. కాదు, కాదు. సర్వసంగ పరిత్యాగులే నిజమైన రాజులు. ఋషికేశ్, హరిద్వార్‌లకు మీరెప్పుడైనా వెళ్ళినప్పుడు చూడండి, సన్యాసులకు 'మహారాజ్' అంటారు. ప్రతి ఒక్కర్ని మహారాజ్! మహారాజ్! మహారాజ్! అని సంబోధిస్తారు. అనగా సన్యాసులంతా మహారాజులని అర్థము. కనుక మహారాజ్ ఎవడు? రాజాధిరాజ, మహారాజ రాజ, అటువంటివారే నిజమైన త్యాగులు.



sri sathyasai vachanamrutam

అయితే ఈనాడు తుచ్ఛమైనటువంటి వాంఛలకు లొంగి ఆ మహారాజ తత్త్వమనే దివ్యతత్త్వానికి మనం దూరమైపోతున్నాం. లేనిపోని ఆశలతో జీవితాన్ని వ్యర్థం చేసుకుంటున్నాము. దినదినానికి భారములు మనం అధికం చేసుకుంటున్నాము. ఇది కాదు, విద్యయొక్క వివేకము. ఇదికాదు, విద్యయొక్క విజ్ఞానము. విద్యయొక్క విజ్ఞానమనే సత్యాన్ని గుర్తించాలి. సత్యాన్వేషణే విద్యయొక్క వివేకము. అదే విద్యయొక్క గమ్యము. సత్యాన్ని గుర్తించాలి. అప్పుడే నీవు సత్యస్వరూపుడవైపోతావు.

**విద్యకు వినయము, శీలము, సత్యము ఈ మూడే గౌరవమునందించే ప్రధాన గుణములు**

విద్యార్థులారా! మీరు విద్యార్థులుగా ఉండినప్పుడు విద్యార్థులకు తగినటువంటి నడతను దృష్టియందుంచుకోవాలి. విద్యార్థులని పేరు పెట్టుకొని, విషయార్థులుగా ప్రవర్తిస్తుంటుంటే మీ జీవితమునకే అగౌరవమైపోతుంది. మానవత్వానికి తలవంపులుగా రూపొందుతుంది. విద్యకు వినయమే ప్రధాన గౌరవము. సత్యము, శీలమే క్షేమము. భగవద్భక్తియే దీనికి ప్రాణం. ఈ మూడింటిని విసర్జించుకున్నప్పుడు మనం ఎన్ని చదువులు చదివినప్పటికిని ప్రయోజనముండదు.

**చదువులన్ని చదివి చాల వివేకియై**
**మదిని తన్నెరుగడు మందమతుడు**
**ఎంత చదువు చదివి ఏరీతినున్నను**
**హీనుడవగుణంబు మానలేడు.**

**తరచి చదువు చదువ తర్కవాదమెగాని**
**పూర్ణజ్ఞానమెపుడు పొందలేడు**
**చదువులన్ని చదివి చావంగనేటికి**
**చావులేని చదువు చదువవలయు.**

ఆనందమునకు చావు లేదు. అట్టి ఆనందస్వరూపాన్ని మనం నిత్యంగా గుర్తించాలి.

విద్యార్థులారా! మీకు చక్కగా తెలుసు. ఈనాడు చదువుకున్నటువంటి



sri sathyasaivachanamrutam

విద్యావంతులకంటే ఏ చదువులు లేనటువంటి పల్లెప్రజలయందే నీతి, నిజాయితి కనిపిస్తుండాది. చదువుకున్నటువంటి పట్టణవాసులకంటే చదువుసంధ్యలు లేని అడవిజాతివారియందైనా కొంచెం నీతి, నిజాయితి కనిపిస్తుండాది. ఎక్కడ విద్యాసంస్థలు, న్యాయస్థానములు, యూనివర్సిటీస్ ఉన్నాయో అక్కడనే అన్యాయ, అక్రమ, అనాచారాలంతా ప్రబలమైపోతున్నాయి. వారియందే కొంచెం, నీతి, నిజాయితీ, దయా దాక్షిణ్యాలు కనిపిస్తున్నాయి.

ఈనాడు జగత్తునకంతా విద్యావంతులవల్లనే ఎక్కువ ప్రమాదం ఉన్నది. విద్యాహీనులవల్ల ఏమాత్రము ప్రమాదము జరుగదు. ఈ విధంగా చదువు దిగజారిపోయింది. మీరు జగత్తుకు ఆదర్శవంతమైనటువంటి జీవితాన్ని అందించే విద్యార్థులుగా రూపొందాలి. మీ దోషాలను మీరు గుర్తించుకొని అలాంటి దోషములు రాకుండా చూచుకోవాలి. ఈనాడు చదువుకున్నవాడు చదువులేని మొరటు మనిషిముందర అగౌరవపడిపోతున్నాడు. కనుక మనం మొట్టమొదట ఇతరులను గౌరవించి, వారిచే మనము గౌరవాన్ని అందుకోవాలి. భగవంతుని ప్రేమకు పాత్రుడైనవాడే నిజమైన మానవుడు. అది లేనటువంటి మానవుడు మానవుడే కాదు. కేవలం ఆకార మానవుడేకాని, ఆచార మానవుడు కాదు.

**దయచేత ధన్యులు కావలెరా ఎంతటివారైనా అసురుడైన**
**భూసురుడైన అఖండ తెలివిగలవాడైన ॥దయ॥**
**విద్య నేర్చి వాదాడినగాని పద్యములెంతో పాడినగాని**
**కొండగుహలలో నుండినగాని కూర్చుని జపములు చేసినగాని**
**॥దయ॥**
**యోగాభ్యాసము చేసినగాని భాగవతాదులు చదివినగాని**
**బాగుగ గెడ్డము పెంచినగాని పట్టెనామములు పెట్టినగాని**
**॥దయ॥**
**ముక్కుమూసి జపమాచరించిన మొక్కుచు బాగా నిలచియుండిన**

srisathyasaivachanamrutam

**వెక్కివెక్కి ఏడ్చినగాని మొరలిడినను నీకు కరుగదు మనసు ॥దయ॥**
**కాషాయ వస్త్రము వేసినగాని కంఠమాల ధరియించినగాని**
**గడగడమని జపమాల తిప్పిన కడకు నీయొద్దకు రావలె బాబా**
**॥దయ॥**
**భక్తితో మిమ్ము గొలిచినగాని పుట్టపర్తికే వచ్చినగాని**
**పూజలు బాగా చేసినగాని పుడమియంతయును తిరిగినగాని**
**॥దయ॥**

ఇవన్నీ వేషములతో కూడినటువంటివేకాని, దయయే నిజమైన సంపద, అట్టి దయను మనము సంపాదించుకున్నప్పుడు ధన్యులమైపోతాం. కేవలం విభూది పెట్టుకున్నంత మాత్రమున, కుంకాలు పెట్టుకున్నంత మాత్రమున, నామాలు పెట్టుకున్నంత మాత్రమున ధన్యులు కాలేరు. గడ్డాలు పెంచుకున్నంత మాత్రమున కాదు ధన్యులు, జపమాలలు తిప్పినంత మాత్రమున కాదు ధన్యులు, చిత్తశుద్ధి కలగాలి.

**దేహమునందు శుద్ధమైన రక్తము, చిత్తమునందు పవిత్రమైన భక్తి ప్రసరించాలి**

విద్యార్థులారా! రెండు విషయాలు మీ హృదయంలో భద్రంగా నాటుకొనిపోవాలి. మన దేహములో రక్తము ఎంతకాలము పరిశుద్ధంగా ప్రవహిస్తూ ఉంటాదో అంతకాలము మన దేహము ఆరోగ్యంగా ఉంటాది. అదే విధముగనే మనయందు పరిశుద్ధమైనటువంటి భక్తి ప్రసరించినంతకాలము మనకు ఆనందానికి ఏమాత్రము లోటు ఉండదు. దేహములో శుద్ధమైన రక్తము ప్రవహించాలి, చిత్తమునందు పవిత్రమైన భక్తి ప్రసరించాలి. ఈ రెండూ ఉన్నప్పుడే దేహశుద్ధి, ఆత్మశుద్ధి. ఇవి రెండింటిని మాత్రం మీరు సాధించాలి. ఇవే నిజమైన విద్యలు. ఈ రెండింటిని మీరు అభివృద్ధి గావించుకొని, ఇంక మీరు చెయ్యవలసినటువంటి భజనలు, సత్కర్మలు అన్నీ ఆచరించుచూ పోవచ్చు. విద్యార్థులు ఈ యూనివర్సిటీయందు ఒక్క ప్రత్యేకమైన ఆదర్శాన్నికూడను నిరూపించాలి. ఎన్ని కోట్లమంది విద్యార్థులు లేరు ఈ ప్రపంచంలో! కాని, వారు అందరితో మీకు పోలికలు ఉండకూడదు. మనకు మనమే ఆదర్శముగా ఉండాలి!

srisathyasaivachanamrutam

ఒక చిన్న ఉదాహరణము. ఒక విత్తనము భూమిలో నాటుతాము. అందుకొరకు భూమిని చక్కగా దున్ని మంచి మట్టిగా చేస్తాము. శక్తివంతమైన ఎరువులు అందిస్తాము. నీరు పోస్తాము. సూర్యరశ్మికూడను దానిపైన పడేటట్టు చూస్తాము. తరువాత ఆ విత్తనము మొక్కగా, చెట్టుగా అభివృద్ధి అవుతుంది. ఈ విధంగా విత్తనము మొక్కగా అభివృద్ధి కావలెనంటే మట్టి కావాలి, ఎరువు కావాలి, నీరు కావాలి, గాలి కావాలి, సూర్యరశ్మి కావాలి. వీటన్నిటిని స్వీకరిస్తుంది. కాని, తన స్వభావాన్ని మాత్రం తాను నిలబెట్టుకుంటూ ఏ విత్తనము మనము నాటామో ఆ చెట్టుగా రూపొందుతుంది. ఈ చెట్టు మట్టి కాదు, ఈ చెట్టు నీరు కాదు, ఈ చెట్టు గాలి కాదు, ఈ చెట్టు వెలుతురు కాదు. వెలుతురును, గాలిని, ఎరువును, మట్టిని తీసుకుంటుంది కాని, తాను తానుగానే ఎదుగుతుంది. అట్లనే మనముకూడను మంచివారినుండి సద్గుణములు తీసుకోవాలి.

**నీ స్వభావాన్ని నీవు మరువకూడదు**

ఎక్కడ మంచి జరుగుతుందో దానిని నీవు స్వీకరించాలి. కాని, నీవు నీవుగానే జీవించాలి. అదీ నిజమైన మానవత్వముయొక్క ప్రధానసూత్రము. నేను గాలిని తీసుకున్నాను కదా అని గాలితో పాటు చేరిపోకూడదు. ఈ మట్టి లేకపోతే నేను మొక్క కాదు కదా అని నువ్వు మట్టిగా మారిపోకూడదు. అన్నీ తీసుకో, స్వీకరించు; కాని, నీ స్వభావాన్ని మాత్రం నీవు మరచకూడదు. అయితే విద్యార్థులు ఈనాడు ఆ విధంగా నడుచుకుకోవటం లేదు. ఎవరో ఒక బుష్కోటు వేసుకుంటే తాను ఆ బుష్కోటు వేసుకోవాలని కోరుకుంటారు. అది అనుకరణ. దానికి నీవు బానిసవైపోతున్నావు. ఈ అనుకరణ చాలా చెడ్డది. మంచిని తీసుకో, ఎవరినుంచి వచ్చినా సరే మంచిని తీసుకో! కాని, నీవు నీవుగా జీవించు. నీవు దైవత్వానికి అర్పితంకా! అంతేకాని, సామాన్య మానవులకు అర్పితం కాకూడదు. ఇదీ నిజమైన విద్యయొక్క విశిష్టత.

కనుక విద్యార్థులారా! మనము బయటవారిని ఏమాత్రముకూడను అనుకరణ చెయ్యకూడదు. ఇమిటేషన్ అనేది తక్కువ స్థాయికి చెందినటువంటిది. కాని స్వభావము అనేది నీ ఆత్మకు సంబంధించినది. దానినే మనము అనుసరించాలి. ఆ విధమైన

sri sathyasai vahini amrutam

సద్గుణాలను స్వీకరించి, సదభ్యాసాలను అనుసరించి, సత్క్రమమైన మార్గములో ప్రవేశించి, ఆదర్శవంతమైన విద్యార్థులుగా మీరు రూపొందాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 20-02-1992న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam